

# భవానీద్వీపం

**–వనం వేంకట వరప్రసాదరావు**



**నాలుగువందల సంవత్సరాల కాలపరిధిలో సామాజిక, చారిత్రక వాస్తవాలను, సాహిత్య, ఆధ్యాత్మిక, యోగశాస్త్ర, మంత్ర శాస్త్ర రహస్యాలను కలుపుతూ సాగిన గాథ. చరిత్ర నిర్ధారించిన సత్యాలు, చరిత్రకు అందని రహస్యాలు, చారిత్రక పురుషుల సాహసాలు, కలగలిపి సమన్వయము చేసిన గాథ. తెలియని కొన్ని వాస్తవాలను తెలియజేస్తూ, తెలుసును అనుకుంటున్న కొన్ని 'అపోహలను' దూరం చేస్తూ సాగే కల్పిత సాహసిక గాథ. స్వతంత్ర సమరరంగముతో మొదలుకొని యుద్ధ, జానపద క్రీడల మర్మాలు, సాధకుల గాథలు, త్యాగధనుల చారిత్రక గాథలు కలిసిపోయిన కాల్పనిక గాథ. ఇలానే జరిగింది అని తెలిసిన సత్యాలకు యిలా కూడా జరిగి ఉండవచ్చు అన్న చారిత్రక పరిశీలనను జోడించి, వాస్తవ దూరం కాని ఊహలతో సాగిన పరిశీలనాత్మకమైన కథ. ఒక సాహసిక యోధుడి కథతో మొదలై క్రీ.శ. 1677 నుండి ఆధునిక కాలంవరకూ తరతరాల అంతరాలను, అంతరంగాలను విభిన్న కోణాలనుండి విమర్శించిన గాథ. కొందరికి తెలిసిన కొన్నిటిని, అందరికీ తెలియాల్సిన ఎన్నిటితోనో సమన్వయము చేస్తూ సాగిన వాస్తవ గాథల, చారిత్రక సత్యాల సమ్మేళనమైన కాల్పనిక గాథ!**

## - 39 -

(క్రిందటి సంచిక నుంచి కొనసాగింపు)

శంకర శాస్తుర్లు గారు భయంతో పెట్టిన కేకలకు ఒక్క వుదుటున పూజగదిముందుకు వురికారు అంతవరకూ గదిబయట మొత్తల్లో వున్నవారు. భయంతో కూలబడిన శాస్తుర్లుగారిని లేవదీశారు. నిలువెల్లా వణికిపోతున్నాడు ఆయన. భయము, విస్మయము ముఖంలో పేరుకుపోయినట్లు కనిపిస్తున్నాయి. కొన్ని నిముషాలకు తేరుకున్నాడు. పూజగది తలుపులు నెట్టబోయిన వారిని సైగచేసి వారించాడు. ధైర్యాన్ని కూడదీసుకుని రెండు తలుపులను లోపలికి బలంగా నెట్టి తెరిచాడు. ఆయనతోపాటు అందరూ నివ్వెరపోయారు ఈసారి. ఆశ్చర్యము, భయము కలిసిన ధ్వనులు చేశారు కొందరు. చప్పున వెనక్కు అడుగులువేశారు. నోటమాట లేకుండా, గుడ్లప్పగించి లోపలి దృశ్యాన్ని చూస్తూ వుండిపోయారు అందరూ.

మూసిన కిటికీ తలుపుల సందులనుండి, యిప్పుడు తెరిచిన తలుపులనుండి లోపలకు సన్నగా ప్రసరిస్తున్నది సాయంకాలపు వెలుతురు. ఎదురుగా గది లోపలి పూజామందిరం కనిపిస్తున్నది. మందిరంముందు పద్మాసనంలో కూర్చుని వున్నాడు, క్రితంరోజు అనుకోకుండా ప్రత్యక్షమై చెప్పకుండా మాయమైన నాగసాధువు. కాళ్ళమీదుగా, నడుముమీదుగా పరుచుకున్న జుత్తు తప్ప ఏ ఆచ్ఛాదనా లేదు ఒంటిమీద. ఒళ్ళంతా

పూసుకున్న తెల్లని బూడిదరంగులో మసక వెలుతురులో భయంకరంగా కనిపిస్తున్నాడు. ఎదురుగా ఒళ్ళు జలదరించేలా నేలమీద ఉన్నది పెద్ద కపాలం. సన్నని వెలుతురులో మరింత తెల్లగా వికృతంగా కనిపిస్తున్నది.

ఎడమచేతిలో బిగించి పట్టుకున్న త్రిశూలాన్ని వూపుతూ, నేలకు తాటిస్తూ, కుడిచేతి చూపుడు వేలితో బెదిరిస్తూ, యేదో మధ్య మధ్య మాట్లాడుతున్నాడు. కోపంగా, బెదిరింపుగా, అరుపులలా ధ్వనులు వినిపిస్తున్నాయి కానీ అది యే భాష అన్నది వీళ్లకు అంతుపట్టడంలేదు. లోపలి మసక వెలుతురుకు కనులు అలవాటు పడినతర్వాత అప్పుడు యింకా ఒళ్ళు జలదరించే దృశ్యాన్ని చూశారు అందరూ. గావుకేకలు పెడుతూ వెనక్కు పరుగెత్తారు కొందరు. వెనుక మొత్తల్లోకి తప్పుకుని వణుకుతూ చూడసాగారు కొందరు. శంకరశాస్త్రుర్లు గారు యిప్పుడు కొద్దిగా తేరుకున్నారు. నెమ్మదిగా, గుమికూడి కంపిస్తూ లోపలి చూస్తున్నారు అందరూ.

నాగసాధువుకు నాలుగడుగుల దూరంలో నిలువెల్లా వూగిపోతూ కనిపించింది నేలకు ఎనిమిది అడుగుల ఎత్తున లేచి పడగ విప్పి వూగిపోతున్న నల్లని త్రాచు. దవడలు గాలితో వుబ్బిపోతున్నాయి బుసలు కొడుతుంటే. నల్లని శరీరం మీద చిక్కని బూడిద రంగు పొడలు మెరుస్తున్నాయి. నాగసాధువు శూలాన్ని విదిలిస్తూ, చూపుడు వేలితో బెదిరిస్తూ అదిలిస్తున్నట్లు అరుస్తున్నపుడల్లా వెనక్కు వంచిన పడగను మరలా ముందుకు విసురుతున్నది. సర్రున పూజామందిరం వైపు సాగినట్లే సాగి, సాధువు త్రిశూలానికి బెదిరినట్టు మరలా వెనక్కు తగ్గుతున్నది. గదిబయట వున్నవారి చెవులు దిబ్బెళ్ళు పడుతాయా అన్నట్లు బుసలు కొడుతున్నది. చేవదేలిన నల్లమద్ది మానులా నిగనిగలాడుతున్నది. పదిహేను అడుగులకు పైగా పొడవు వున్నది. చటుక్కున పడగ దించి, గోడవారగా మందిరంవైపు సాగడానికి ప్రయత్నం చేసింది. మెరుపులా శూలాన్ని కుడిచేతిలోకి తీసుకుని అడ్డం పెట్టాడు సాధువు. బుస్సున నిలువెత్తున లేచి కసితో భయంకరంగా వూగిపోయింది ఆ కాలనాగు.

నిలువెల్లా లేచినప్పుడు దాని పరిమాణాన్ని గమనించారు మొత్తల్లో వున్నవారు. దడదడలాడుతున్న గుండెలను చిక్కబట్టుకుని, తోసుకుంటూ నలుగురు బయటకు పరుగెత్తారు. పెద్ద పెద్ద వలలో, కర్రలో తీసుకొచ్చి దాన్ని పట్టుకోడమో, కొట్టడమో చేయాలని వాళ్ళ ఆలోచన. దాని చూపు అంతా పూజామందిరం వైపే వుండడం గమనించారు అందరూ, శాస్త్రుర్లు గారు కూడా! కారణం ఏమిటో మిగిలినవాళ్లకు తెలియకున్నా, శాస్త్రుర్లు గారికి అర్ధమయ్యింది ఆ కారణం. ఆయన ఊహించింది నిజం అయ్యింది.

చటుక్కున ముందుకు వంగి మందిరంలో పళ్లెంలో వుంచిన నాగమణిని అందుకున్నాడు నాగసాధువు. ఎదురుగా నోరుతెరిచి నేలమీద వున్నది కపాలం. అరచేతివెడల్పున కనుల స్థానంలో వున్న రంధ్రాలతో శూన్యంలోకి చూస్తున్నట్లు పడి వున్నది. దాని మెదడు భాగం తొలిచి తెల్లని పళ్లెంలా చేసి వున్నది. తన చేతిలోకి తీసుకున్న మణిని ఆ కపాలంలో వుంచాడు నాగసాధువు. కపాలాన్ని గుండెకు పొదివిపట్టుకుని చివ్వున లేచాడు.

సర్రున తానూ లేచి కోపంగా పడగ విసిరింది ఆ కాలనాగు. మొదటినుండీ నాగసాధువును భయపెట్టడానికి అన్నట్లు వున్నది దాని తీరు. నాగసాధువును కాటు అందుకునే ఉద్దేశం లేనట్టుంది ఎందుకో! దూరంనుండే పడగ విసురుతున్నది. సాధువు కూడా దానిని అదిలించి బెదిరించి వెళ్లగొట్టే ప్రయత్నం చేస్తున్నట్లు వున్నాడేతప్ప కొట్టడానికి, చంపడానికి చూడడం లేదు. తనఎత్తున అలలా లేచిన కాలనాగును నేర్పుగా శూలంలో యిరికించి నేలకు పడగొట్టాడు నాగసాధువు. పడగను శూలంలో యిరికించి సరసరా మెలికలు తిప్పాడు. మెడ చిక్కుకుని మెలికలుపడి మరింత బుసలు కొట్టింది అది. శూలాన్ని అలా దూరంగా పట్టుకుని ద్వారంవైపు వేగంగా అడుగులు వేశాడు నాగసాధువు. భయంతో, కంగారుతో, కేకలుపెడుతూ తోసుకుంటూ బయటకు పరుగులుతీశారు అప్పటిదాకా గుడ్లప్పగించి చూస్తున్నవాళ్ళు.

పరుగులాంటి నడకతో పెరటిలోకి వెళ్లే తలుపులను తెరిచి, బయటకు పెరట్లోకి దూకాడు శాస్త్రుర్లుగారు. అడ్డు రాకుండా వేగంగా పక్కకు తప్పుకున్నాడు. సాధువుచేతిలో వున్న శూలానికి చిక్కి, విడివడడానికి విఫల ప్రయత్నం చేస్తున్నది ఆ నల్లత్రాచు. పెద్ద పరదాలా నేలను వూడుస్తూ అది నడుమునుండి తోకదాకా మెలికలు తిరుగుతున్నది. అలానే దాన్ని శూలంతో ఎత్తిపట్టుకుని, యీడుస్తూ పెరటిలోకి వెళ్ళాడు నాగసాధువు. మధ్య మధ్య, వుండి వుండి, కోపంగా యేదో అంటున్నాడు ఆ కాలనాగుతో తగాదా పడుతున్నట్లు! అదికూడా భయంకరంగా బుసలు కొడుతూ, తల విసురుతూ, కోరలు కనిపించేలా నోరుతెరిచి కీచుమని ధ్వనులు చేస్తున్నది, అరుస్తూ తిడుతున్నట్లు!

కపాలాన్ని జాగ్రత్తగా గుండెకు పొదివిపట్టుకుని, శూలాన్ని దూరంగా సాచి బయటకు వచ్చాడు నాగసాధువు. నేలకు శూలపుమొనతో ఆ పెనుపామును అదిమిపట్టి వుంచాడు. చూపులను దానిమీదనుండి తిప్పకుండా 'హర్ హర్ భోలా' అని నినాదం చేశాడు. అప్పుడు జరిగింది ఆ సంఘటన.

తన జీవితంలో ఎన్నడూ ఎరుగనంతగా శంకరశాస్త్రుర్లుగారు విస్తుపోయిన సంఘటన. కొద్దిసేపటిక్రితం పూజగదిలో నాగసాధువును, భయంకరమైన నాగుపామును చూసినప్పటికన్నా ఎక్కువ సంభ్రమానికి గురిచేసిన సంఘటన జరిగింది.

'నాయనా శంకరా!' అని నిదానంగా పిలిచాడు నాగసాధువు, స్పష్టమైన తెలుగులో. నోటమాటలేకుండా పోయింది శంకరశాస్త్రుర్లు గారికి. బుసలుకొడుతూ మెలికలు తిరుగుతూ పడగ విసురుతున్న కాలనాగును కలలో చూస్తున్నట్లు చూస్తున్నాడు. కలలో వినబడుతున్నట్లు నాగసాధువు గొంతు వినబడుతున్నది. కొన్ని క్షణాలపాటు స్పృహలో లేనివాడిలా నిశ్చలంగా వుండిపోయాడు.

' నాయనా శంకరా! నీ తండ్రి మృత్యుంజయ శాస్త్రి. నీ తాత వీరభద్రశాస్త్రి. వీరభద్రశాస్త్రికి యిది జన్మనిచ్చింది..' అన్నాడు తన చేతిలోని పుఱ్ఱెను గుండెలకు తాడించుకుంటూ! శంకర శాస్త్రుర్లు గారికి ఒక్కనిముషం ఏమీ అర్థం కాలేదు. తరువాత ఒక అనుమానంలాగా తోచింది. దాన్నితీర్చుకోడానికి అన్నట్లు ఏదో అడగడానికి నోరు తెరిచాడు. 'హర్ హర్ భోలా' అన్నాడు సాధువు. చిరునవ్వు నవ్వుతూ 'సదా శివ .. సదాశివ..' అన్నాడు. ఆశ్చర్యంతో ఊపిరి ఆగినట్లు అనిపించింది శంకరశాస్త్రుర్లు గారికి.

తన తాత వీరభద్రశాస్త్రి తనను ఒడిలో కూర్చోబెట్టుకుని చెప్పిన మాటలు గుర్తుకొచ్చాయి. అంటే యిప్పుడు తన ఎదురుగా వున్నది తన తాత వీరభద్రశాస్త్రిగారి తండ్రి సదాశివశాస్త్రి! ఎప్పుడో నూట పాతికేళ్ల క్రితం ప్రయాగ మహా కుంభమేళాలో కనిపించినట్లే కనిపించి మాయమైనవాడు! తనకొడుకు జీవితాంతమూ తనకోసం కలవరించినా మళ్ళీ కనిపించకుండా పోయినవాడు! రెండు తరాలపాటు కనిపించకుండా పోయినవాడు! నాలుగు తరాలపాటు బతికి, యిప్పుడు, కొడుకు మనవడి ముందు, చేతిలో పుఱ్ఱెతో, దిగంబరుడిగా నిలబడి వున్నాడు.యిది నిజమా? సాధ్యమా? నాలుగుతరాలపాటు బతికాడు అంటే యిప్పుడాయన వయసు??? శంకరశాస్త్రుర్లుగారి మనసులో పుట్టచెదలలాగా ముసురుతున్న ప్రశ్నలు!

ఈపాటికి పెద్ద పెద్ద చేపల వలలు, బలమైన పెద్ద కర్రలు పట్టుకుని పెరట్లోకి పరుగున వచ్చారు గ్రామంలోకి పరుగెత్తిన నలుగురు. మిగిలినవాళ్లు కూడా యింటిచుట్టూ తిరిగి, పెరట్లోకి చేరుకున్నారు కర్రలు పట్టుకుని. చూస్తుండగానే హోరున లబలబలాడుతూ గ్రామంలో సగంమంది మగాళ్లు పెరట్లోకి చేరుకున్నారు. చూపులను పడగ విసురుతున్న కాలనాగు మీదినుండి మరల్చలేదు నాగసాధువు, కాదు కాదు , సదాశివశాస్త్రి! చిరునవ్వుతో చెప్పాడు ' యిప్పుడు నా వయసు నూట యాభైరెండు సంవత్సరాలు!' నమ్మలేనట్లుగా చూశాడు శంకరశాస్త్రుర్లు గారు. చుట్టూ గుమికూడిన వాళ్ళు ఆశ్చర్యంతో చేసిన ధ్వనులకు బుస్సున ఎగిరిపడింది ఆ కాలనాగు. దాని కోపము, కసి తారాస్థాయికి చేరుకున్నాయి యిప్పుడు. తోకతో నేలమీద చరుస్తున్నది. విసురుగా మెలికలు తిరుగుతూ నేలమీది ఆకులను, చిన్న చిన్న రాళ్లను, దుమ్మును రేపుతున్నది. అందితే కాటువేయాలని పడగ విసురుతున్నది యిప్పుడు. కర్రలు, వలలు పట్టుకుని వందల సంఖ్యలో జనం గుమికూడిన తరువాత దాని క్రోధము, కసి రెట్టింపు అయ్యాయి.

' నా నాగసాధు గురువు మూడువందల సంవత్సరాల వయసులో యింకా బ్రతికే వున్నాడు! నాగసాధువులకు యిది సహజమే! నాకుమాత్రం శరీరాన్ని వదిలే సమయం దగ్గరపడింది! యిక కాశీకి వెళ్లి ..స్వేచ్ఛపొందడమే .. ' అని విచిత్రంగా నవ్వాడు! ' శంకరా! వందసంవత్సరాలు బతికి సహజంగా చనిపోయిన శ్వేతనాగు తలలోనుండి తీసినది ఈ నాగమణి! వందసంవత్సరాలు బతికిన నాగులు దైవత్వాన్ని పొందుతాయి. వాటిని చంపినవాళ్లను ఏడు తరాలు పగబట్టి వెంటబడతాయి. నైమిశారణ్యంలో నా కంటబడింది ఆ మహాశ్వేతనాగు కళేబరం. నాలుగువందల ఎముకలతో, పాతిక అడుగుల పొడవునా పరుచుకుని వున్నది. దాని తల ఎముకలలో పెరిగిన మణిని తీశాను. కలలో కనిపించి ఆ మణిని నీకు చేర్చాలన్నాడు కాశీవిశేశ్వరుడు. అందుకే వచ్చాను! ఇది నీకు కాశీనాథుడి ప్రసాదం శంకరా! అంతులేని మహిమను యిస్తుంది ఈ నాగమణి. నీకు దీన్నిఅందించి, యిక ఎవరికీ కనిపించకుండా వెళ్ళిపోదామనుకున్నాను!'

' ఈ కాలనాగు ఆ శ్వేతనాగు జమిలిపాములు. నాగమణిని జాతి సర్పాలు వదలవు. మణిని పొందినవాళ్లను వెంటాడుతాయి. నాకు తెలుసు. అందుకే దీని కోసం ఆగాను. పట్టుకుపోదామనుకున్నాను' అంటూ క్షణకాలం చూపులు మళ్లించి, తలతిప్పి శంకరశాస్త్రుర్లు గారిని చూశాడు నాగసాధువు, కాదు కాదు, సదాశివశాస్త్రుర్లు గారు. క్షణకాలం, కేవలం క్షణకాలం! అంతే!!

శూలం వంకీలనుండి ఎప్పుడు తప్పుకున్నదో, నల్లని సముద్రపు అలలా పదిఅడుగుల ఎత్తున పైకిలేచింది కాలనాగు. పిడుగులా సదాశివశాస్త్రుర్లుగారి పాదాన్ని తాకింది దానిపడగ. కసిగా కరిచిపట్టుకుని చిమ్మి చిమ్మి కొట్టింది విషాన్ని. గావుకేకలు పెడుతూ చెల్లాచెదురు అయ్యారు

గుమికూడినవాళ్లు. కఱ్ఱలతో ముందుకు దూకారు కొందరు. పక్కకు దూకి వలలు విసరడానికి సిద్ధమయ్యారు కొందరు. 'హు'మ్మని ధ్వని చేస్తూ దాని మెడను పట్టుకుని లాగాడు సదాశివశాస్త్రుర్లు గారు. చీలమండ ఎముకను కొరికిపట్టుకున్న కోరలతోసహా దాని పడగను నేలకు విసిరికొట్టాడు. చీలిన చీలమండనుండి నెత్తురు చిమ్మింది. అంతవరకే లీలగా గుర్తు వున్నది శంకరశాస్త్రుర్లు గారికి. యిద్దరు మనుషులు ఎత్తితేగానీ లేవని తిరగలి రాయి పక్కనే పడి వున్నది! దానిని ఎప్పుడు లేపాడో, బలంగా, పిచ్చిపట్టినవాడిలా ఆ తిరగలి రాయితో దానిపడగను పచ్చడి చేశాడో ఆయనకు తెలియదు.

చూస్తున్నవాళ్ళు తేరుకునేలోపు చాటలాగా విప్పుకున్న దానిపడగ తిరగలి దెబ్బలకు గుంటపడిన నేలలో నుగ్గు నుగ్గు అయ్యింది. సెలయేటి ప్రవాహం అలలు అలలుగా లేచిపడినట్లు దాని శరీరం మెలికలు తిరుగుతూ, తోక ఎగిసి ఎగిసిపడి చలనం ఆగిపోయింది. ఇంకా కసిగా తిరగలిని ఎత్తి మోదుతూనే వున్నాడు శంకరశాస్త్రుర్లు గారు!

'శంకరా' అన్న పిలుపుకు తిరగలిరాయిని పక్కన పడేసి ముత్తాత దగ్గరకు చేరుకున్నాడు శంకరశాస్త్రుర్లు గారు. నల్లని కాటుక రంగులోకి తిరిగింది సదాశివశాస్త్రుర్లు గారి శరీరం. తెల్లని నురుగు నోటివెంట ధారగా గడ్డాన్నితడుపుతూ కారుతున్నది. నిలువునా నేలకు పడిపోయినా గుండెలకు అదుముకున్న కపాలంలో వుంచిన నాగమణిని పొదివిపట్టుకునే వున్నాడు.

'శంకరా! మణి..మణి.. అంటూ పుర్రెలోనుండి నాగమణిని తీసి శంకరశాస్త్రుర్లు గారి చేతిలో పెట్టాడు. ' అయ్యో.. ఎంతపనిచేశావు! నాగశాపం.. నాగ దోషం..' అంటూ నురగలు కక్కుతూ కనులు తేలవేశాడు సదాశివశాస్త్రుర్లుగారు. అంతలోనే బలవంతంగా కనులు తెరిచి ' చిన్న.. చిన్న..' అని ఏదో అనబోయాడు, ధారలుగా నురగలు వెలువడ్డాయి. బలం కూడగట్టుకుని పెదవులు బిగించి పట్టుకున్నాడు. శ్వాస తీసుకోడం ఆపుజేశాడు. 'ఠప్పు'మని చిన్న ధ్వని అయ్యింది. ఆయన కపాలంనుండి చిక్కనిరక్తం వుబికి వుబికి మడుగు కట్టింది. శరీరం చలనంలేకుండా అయ్యింది.

(కొనసాగింపు వచ్చే సంచికలో..)

COMMENTS